జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
శుక్రవారం 12 సెప్టెంబర్ 2025 పేజీలు : 14



3 లో..

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి



## యువత గంజాయి బారిన పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి

2 లో..

జిల్లా కలెక్టర్ హనుమంతరావు

### గర్భిణీ స్త్రీల వైద్య సేవల పట్ల

# నిర్లక్ష్యంగా ఉండొద్దు...

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



9 లో..



## ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలి

2 లో..

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. చింతలపాలెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.



## చేనేత అవార్డు గ్రహీతలను సన్మానించిన అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు

వార్త 2లో

### అభివృద్ధిపై ఆశలు... భూములు

# పోతున్న బాధలు

రానున్న 10 ఏళ్లలో దూసుకుపోనున్న మునుగోడు
గట్టుప్పల్ కేంద్రంగా..
రింగ్ రోడ్డు, రింగ్ రైల్వే, సెమీ హై స్పీడ్ రైల్వే లైన్ జంక్షన్లు
ఎటు తేల్చుకోలేకపోతున్న మునుగోడు ప్రజలు

వార్త 2లో




## శ్రీ మత్స్యగిరి ఆలయంలో టెండర్లు

వలిగొండ సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి ప్రతినిధి)

మండలంలోని వెంకటాపురంలోగల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామీ ఆలయంలో ఒక సంవత్సర కాలానికి వాల్ పోస్టర్లు ప్రింటింగ్, తడకల పందిర్లు, ఆర్చీలు వేయుటకు, టికెట్ పుస్తకాలు, స్టేషనరీ ప్రింటింగ్, ఫ్లెక్సీ బ్యానర్లు, సున్నం రంగులు వేయుటకు, రోజు వారి పలు, పెరుగు, కూరగాయలు సరఫరా, విద్యుత్ పరికరాలు, డెకరేషన్, మైకుసెట్ వివిధ వస్తువుల సరఫరా కు ఈ నెల 16 న మంగళవారం ఆలయ ఆవరణలో సీల్ టెండర్ వేయుటకు ఆలయ అధికారులు నిర్ణయించారు. ఆసక్తి కలవారు సమయానుకూలంగా పాల్గొనాలని ఆలయ కమిటీ ఛైర్మెన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి మోహన బాబు తెలిపారు.

# యువత గంజాయి బారిన పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్

## హనుమంతరావు

భువనగిరి సెప్టెంబర్11(ప్రజాజ్యోతి ప్రతినిధి)

యువత గంజాయి బారిన పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు .గురువారం జిల్లా లో గంజాయి నియంత్రణ పై నిర్వహించిన సమావేశంలో జిల్లా అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, జిల్లా రెవిన్యూ డివిజన్ అధికారి కృష్ణారెడ్డి,మరియు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, పోలీస్ శాఖల, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో వివిధ రకాల మాదకద్రవ్యాలపై 35 కేసులు నమోదు చేయడం జరిగిందని, 75 మందిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. డ్రగ్స్ వినియోగ ప్రాంతాలను గుర్తించాలన్నారు. సంబంధిత అధికారులు అందరూ సమన్వయం చేసుకుంటు గంజాయి రహిత జిల్లాగా మార్చాలన్నారు. మత్తు పదార్థాలకు బానిస కాకుండా, యువత వాటి వల్ల కలిగే నష్టాలను తెలిసేలా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాధా కృష్ణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి నరసింహారావు,జిల్లా వైద్య శాఖ అధికారి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

చింతలపాలెం సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) :

విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. చింతలపాలెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి సైన్స్ క్లాసులో పాల్గొని విద్యార్థుల నోట్‌బుక్స్ పరిశీలించారు. నిజజీవితంలో ఉపయోగపడే ప్రాథమిక కెమికల్ ఫార్ములాలను విద్యార్థులను అడిగి



తెలుసుకున్నారు. భవిష్యత్తులో స్థిరపడేందుకు ఏ కోర్సు ఎంచుకోవాలో పదో తరగతి నుంచే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ వేరువేరు జీవన శైలులు ఉంటాయని, వాటికి తగ్గట్టుగా ఇంటర్, డిగ్రీ కోర్సులను ఎంచుకోవాలని సలహా ఇచ్చారు. పదో తరగతి లో బాగా కష్టపడి చదివితే భవిష్యత్తు మెరుగవుతుందని, వార్షిక పరీక్షలకు ప్రణాళికలు వేసుకొని మంచి మార్కులు సాధించాలని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ సురేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నారాయణరావు, ఆర్ఐలు వాసుదేవరావు, ఆత్రేయతో పాటు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చేనేత అవార్డు గ్రహీతలను సన్మానించిన అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు

సంస్థాన్ నారాయణపురం,

సెప్టెంబర్ 11, (ప్రజాజ్యోతి) : సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో పాలు చేనేత అవార్డులను అందుకున్న చేనేత కార్మికులను యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు సన్మానించారు. గురువారం ఆయన పుట్టపాక గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల చేనేత జాతీయ అవార్డులు పొందిన గజం




నర్మదా నరేందర్ దంపతులను కూడా పవన్ లను వారి ఇంటికి వెళ్లి శాలువాలతో సన్మానించారు. అనంతరం కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు గ్రహీతలు సామల భాస్కర్ కొలను శంకర్ లను సత్కరించారు. పుట్టపాక హ్యాండ్లూమ్ క్లస్టర్ భవనానికి ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లుగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ గజం గోవర్ధన్, జిల్లా చేనేత జోలి శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, డి వో రాజేశ్వర్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, సి డి ఓ రమాకాంత్ చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై ఆశలు... భూములు పోతున్న బాధలు

## రానున్న 10 ఏళ్లలో దూసుకుపోనున్న మునుగోడు

## గట్టుప్పల్ కేంద్రంగా.. రింగ్ రోడ్డు, రింగ్ రైల్వే, సెమీ హై స్పీడ్ రైల్వే లైన్ జంక్షన్లు

## ఎటు తేల్చుకోలేకపోతున్న మునుగోడు ప్రజలు

సంస్థాన్ నారాయణపురం,

సెప్టెంబర్ 11, (ప్రజాజ్యోతి) : వెనకబడిన మునుగోడు నియోజకవర్గ ప్రజలను అభివృద్ధి పై ఆశలతో ఒకవైపు భూములు కోల్పోతున్న బాధలు మరోవైపు వెంటాడుతున్నాయి. దశాబ్దాలుగా వెనకబడిపోయిన మునుగోడు నియోజకవర్గానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి ఆశలు కల్పిస్తుండగా, కోట్లాది రూపాయల విలువైన భూములను కోల్పోతున్న బాధతో ప్రజలు ఎటు తేల్చుకోలేక సతమతమవుతున్నారు. రానున్న పదేళ్లలో మునుగోడు నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోనున్నట్లుగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రాజెక్టులను బట్టి స్పష్టమవుతున్నది. ఒకవైపు సెమీ హై స్పీడ్ రైల్వే లైన్, ట్రిపులర్ రోడ్డు, రింగు రైల్వే తో పాటు పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేశాయి. కేంద్ర ప్రభుత్వం సెమి హై స్పీడ్ రైల్వే లైన్ ను రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్పోర్ట్ దగ్గర ప్రారంభించి



రాచకొండ గుట్టల మీదుగా నల్లగొండ జిల్లా లోని మునుగోడు నియోజకవర్గం లోకి ప్రవేశిస్తుంది. మర్రిగూడ మండలం నుంచి గట్టుప్పల్ మండల కేంద్రంలో ప్రధాన జంక్షన్ ఏర్పాటు కానున్నది. ఈ ప్రాంతానికి మొత్తం ప్రయాణికులు ఎక్కడానికి దిగడానికి, సరుకు రవాణాకు గట్టుప్పలే ప్రధాన కేంద్రం కానున్నది. అటు నుంచి చిట్యాల, నకిరేకల్, సూర్యాపేట మీదుగా విజయవాడ, రాజమండ్రి, వైజాగ్ వరకు మంజూరు చేసింది. ప్రస్తుతం హైదరాబాదు నుంచి వైజాగ్ వెళ్లే రైల్వే ద్వారా 12 గంటల ప్రయాణం సాగుతున్నది. దీనిని కేవలం నాలుగు గంటల ప్రయాణంగా మార్చడానికి ఈ సెమీ హై స్పీడ్ రైల్వే లైన్ ఏర్పాటు చేస్తున్నది. అతి తక్కువ సమయంలో కేవలం 12 స్టేషన్లలో ఆగేవిధంగా ఈ హై స్పీడ్ రైలు ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీనితో చుట్టుప్రక్కల మండలాల ప్రజలంతా గట్టుప్పల్ జంక్షన్ ద్వారానే ప్రయాణాలు సాగించే అవకాశం ఉంది. ఈ రైల్వే లైన్ 7 నుంచి 10 ఏళ్లలో పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు తలపెట్టిన త్రిబుల్ ఆర్ రోడ్డు మునుగోడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి నిర్మాణం చేయను న్నారు. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, గట్టుప్పల్, మర్రిగూడ మండలాల నుంచి ఈ త్రిబుల్ ఆర్ రోడ్డు



ఏర్పాటు కానున్నది. త్రిబుల్ ఆర్ రోడ్డు తో పాటు రింగు రైల్వేను మంజూరు చేయనున్నారు. ఈ మూడు ప్రాజెక్టులతో పాటు ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టులు మరో పదేళ్లలో పూర్తికానునట్లుగా తెలుస్తుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం త్రిబుల్ ఆర్ వరకు గ్రామాలన్నింటినీ హెచ్ఎండీఏ పరిధిలోకి తీసుకువచ్చింది. ఓ ఆర్ ఆర్ నుంచి త్రిబుల్ ఆర్ రోడ్డు మధ్యలో ప్రభుత్వం అనేక గ్రీన్ ఫీల్డ్ రహదారులను నిర్మించి, ఫ్యూచర్ సిటీ, గేమ్ సిటీ తో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలలో ఆశలు కల్పిస్తున్నది. కానీ ఈ ప్రాజెక్టులన్నింటికీ భూమినే ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వం చేపట్టే అన్ని ప్రాజెక్టులకు రైతుల నుంచి భూములను సేకరించనున్నారు. ప్రస్తుతం భూముల విలువ లక్షల నుంచి కోటలోకి చేరిపోయింది. దీంతో ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారం అతి తక్కువగా ఉండుదడంతో భూములు కోల్పోతున్న రైతుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వస్తున్నది. ప్రభుత్వం భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని, కొంత ప్రభుత్వ భూమినీ పరిహారంగా ఇస్తే కొంత ఉపశమనం కలుగుత ందని కొంతమంది ప్రజలు డిమాండ్ ప్రభుత్వాన్ని చేస్తున్నారు.

## టంగుటూరు హైస్కూల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు హెచ్ఎం వినతి పత్రం అందజేత



టంగుటూరు హై స్కూల్ లో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ఎమ్మెల్యేకు వినతి ఆలేరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ, తరగతి గది, సైన్స్ ల్యాబ్ మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయురాలు కోడం రమాదేవి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు విజ్ఞప్తి చేస్తూ, వినతి పత్రం అందజేశారు. అభివృద్ధి పనులలో భాగంగా ఎమ్మెల్యే ఆలేరు మండలం లోని శ్రీనివాసపురం, శివలాల్ తండా, మందనపల్లి, టంగుటూరు, షారాజీపేట, శర్బనాపురం, రాఘవపురం గ్రామాలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య విద్యార్థుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని, నిధుల మంజూరుకు కలెక్టర్ తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని, నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ తో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానని అన్నారు.

## నడిగూడెం మండల జిపిఓలు వీరే.




**నడిగూడెం, సెప్టెంబర్ 11, ప్రజా జ్యోతి:**

నడిగూడెం మండలంకు చెందిన క్లస్టర్ గ్రామాలకు నూతనముగా బాధ్యతలు స్వీకరించిన జిపిఓలు నడిగూడెంకు చింతమల్ల కోటయ్య, బృందావనపురం గోపాలపురంకు కస్తాల నాగరాజు, కరివిరాల కాగిత రామచంద్రపురం లకు పిఎంఎల్ నరసింహారావు, సిరిపురంకు షేక్ ఇమ్మాలి, వల్లాపురంకు గంధమల్ల శోభన్ బాబు, రత్నవరంకు నూకపంగు వీరస్వామి, రామాపురం, తెల్లబెల్లి ఏక్లాస్ ఖాన్ పేటలకు అమరారపు నాగేశ్వరరావు లను ప్రభుత్వ కేటాయించినట్టు తహ శీల్దార్ రామకృష్ణారెడ్డి తెలిపారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లకు లైన్ క్లియర్ పట్ల హర్షం వ్యక్తం చేసిన బీసీ నాయకులు.



నడిగూడెం, సెప్టెంబర్ 11, ప్రజా జ్యోతి: తెలంగాణలో బీసీ లకు 42% రిజర్వేషన్లకు లైన్ క్లియర్ పట్ల మండల వ్యాప్తంగా బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శీను మాట్లాడుతూ 50 శాతం రిజర్వేషన్ల క్యాప్ ఎత్తివేస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమని అన్నారు. బీసీలకు రాజ్యాధికార స్థాపన కాంగ్రెస్ పార్టీ తోటే సాధ్యమవుతుందని అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ షిప్ చేయటం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్లు పెంపుకు కృషి చేసిన నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, కోదాడ అభివృద్ధి ప్రదాత శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి లకు, కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని అన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ భార్గవ్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు దంపతులు





**మిర్యాలగూడ, సెప్టెంబర్ 11,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ పట్టణంలోని షాబునగర్ కు చెందిన మిర్యాలగూడ మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ కుటుంబ సభ్యులను గురువారం మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు దంపతులు పరామర్శించారు. రెండు రోజుల క్రితం భార్గవ్ తల్లి తిరునగరు మల్లేశ్వరమ్మ మృతిచెందగా, భార్గవ్ కుటుంబ సభ్యులు అమెరికాలో ఉండటం వలన మల్లీశ్వరమ్మ పార్థివదేహాన్ని కామినేని ఆస్పత్రిలో భద్రపరిచారు. కాగా మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు దంపతులు భార్గవ్ ఇంటికి చేరుకొని మల్లీశ్వరమ్మ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిమూద్, ఖాదర్, గోవింద్ రెడ్డి, బాబ్జి తదితరులు ఉన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి

### అదే స్ఫూర్తితో సమస్యల పై ఉద్యమాలు చేయాలి

### -తమ్మినేని వీరభద్రం

### మిర్యాలగూడలో ఘనంగా వారోత్సవాలు

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 11,( ప్రజాజ్యోతి ):**

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి మతం రంగు పూసి చరిత్రను వక్రీకరిస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం లోని గూడూరు లో సిపిఎం ఆధ్వర్యంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం అగ్రనేతలు పలువురు హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ జగ్జీవన్ రావ్ విగ్రహాలకు, అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలనుసన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆనాడు భూస్వాములు, పెత్తందారులు, నిజాం నవాబులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో సబ్బండ వర్గాలు కులమతాలకు అతీతంగా పోరాటం సాగించారన్నారు. ఎంతోమంది ముస్లింనాయకులు నాయకత్వం వహించి ప్రాణాలుపోగొట్టుకున్నారని గుర్తు చేశారు. నాడు పేదల ప్రజల కోసమే సాయుధ పోరాటం సాగిందని ఆ పోరాట ఫలితంగా నేడు ప్రజలు స్వేచ్ఛగాబతుకుతున్నారన్నారు. దేశ స్వాతంత్ర్య పోరులో గానీ, తెలంగాణ సాయుధ పోరాటంలోగానీ బిజెపి పార్టీ లేదని, కానీ ఆ పోరాటాన్ని హిందు ముస్లింల మధ్య జరిగినట్లు చరిత్రను వక్రీకరిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఆనాటి పోరాట చరిత్రను ప్రజలకు వివరించిచైతన్యపరిచేందుకు సిపిఎంఆధ్వర్యంలో గ్రామ గ్రామాన సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలు చేయాలని కమ్యూనిస్టు క్యాడర్కు కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి ఎర్రజెండానే భవిష్యత్తు ప్రత్యామ్నాయం అన్నారు. దేశ సంపద ప్రజలందరికీ చెందాలని, ప్రజలందరూ సమానంగా హక్కులు పొందాలని ఎర్రజెండా పోరాడుతుందన్నారు. ప్రపంచ శాంతి కోసం ఎర్రజెండా పని చేస్తుందని అసమానతలు లేని సమాజం ఎర్రజెండాతోనే సాధ్యమవుతుందన్నారు. ఐదు సంవత్సరాలు పాటు సాగిన పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి ఇచ్చారని, 4500 మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. నాటి సాయుధ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఈ నెల 17న, నల్గొండలో వారోత్సవాల సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. గ్రామ సీనియర్ నాయకుడు వెంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, ఖమ్మం నల్గొండ జిల్లా కార్యదర్శులు వనం నాగేశ్వరరావు, తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాసం, బండ శ్రీశైలం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మూడవత్ రవి నాయక్ జిల్లా కమిటీ సభ్యులు పాదూరి శశిధర్ రెడ్డి, చౌగాని సీతారాములు, పోలేబోయిన వరలక్ష్మి, వినోద్ నాయక్, నూకల జగదీష్ చంద్ర, డా.మల్లు గౌతమ్ రెడ్డి, బావాండ్ల పాండు తదితరులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువులు

### విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలి
### కోదాడ ఎస్సీ హాస్టల్ లో తల్లిదండ్రుల సమావేశం
### మున్సిపల్ కమిషనర్ రమాదేవి
### వసతిగృహ సంక్షేమ అధికారి పద్మ

**కోదాడ టౌన్, సెప్టెంబర్ 11 ( ప్రజా జ్యోతి):**




తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువులు అని కోదాడ మున్సిపల్



కమిషనర్ రమాదేవి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహం (బి)లో వసతి గృహ సంక్షేమ అధికారి సిహెచ్ పద్మ అధ్యక్షతన నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు సమాజ రూపకర్తలు అని ఉత్తమ సమాజ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర ఎనలేనిది అన్నారు. ప్రతి విద్యార్థి లో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని దానిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వసతి గృహాల్లో ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తున్నదని విద్యార్థులు వాటిని సద్వినం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు తరచూ పేరెంట్స్ మీటింగ్ కు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో వసతి గృహ సంక్షేమ అధికారి సిహెచ్ పద్మ, మున్సిపల్ డిఈ సాయి లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు సుశీల భాయి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతులకు సరిపడా యూరియ వచ్చేంతవరకు మా పోరాటం ఆగదు.

### తెలంగాణ రైతు సంఘం
### జిల్లా సహాయ కార్యదర్శి..
### బెల్లంకొండ సత్యనారాయణ.

**నడిగూడెం, సెప్టెంబర్ 11, ప్రజాజ్యోతి:**

రైతులకు సరిపడా యూరియా వచ్చేంత వరకు మా పోరాటం ఆగదని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. ఈరోజు గురువారం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నడిగూడెం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రం ముందు జరిగిన ధర్నాను ఉద్దేశించి బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ గత నెల రోజుల నుంచి వరి నాట్లు పెట్టుకున్న రైతాంగానికి సరిపడా యూరియా సరఫరా చేయక లేక పోవడం తో పొలాల్లో ఉండాల్సిన రైతులు రైతు సహకార కేంద్రాల వద్ద రోజుల తరబడి ఉదయం నుంచి రాత్రీ పగలు పడిగాపులు కాస్తున్న కాని ఒక్క బస్తా యూరియా దొరకక పోవడం తో రైతులు కడుపు మంటతో రగిలి పోతున్నారని ఈ పాపానికి కారకులు ఎవరని రైతులకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వం కూడా ముందుకు సాగదని అన్నారు. కేంద్రం లో ఉన్న బీజేపీ ప్రభుత్వం ముందు చూపు లేక పోవడం తో ప్రయివేట్ నానో కంపెనీలకు లొంగిపోవడం వల్ల డిమాండ్ ఆధారంగా 72 లక్షల కోట్ల



మెట్రిక్ టన్నుల యూరియా ను 62 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల యూరియా వరకే ఇండెంట్ పెట్టడం 10 లక్షల కోట్ల ఇండెంట్ తగ్గించటం రైతుల పట్ల చూపిస్తున్న సవతితల్లి ప్రేమే మాత్రమేనని రైతుని వ్యవసాయం నుండి దూరం చేయడమేనని వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగాలకు అప్పజెప్పడమేనని బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు .తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు బిజెపి మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ ఉండి కూడా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియాను తెప్పించడం లో పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు.చిన్న సన్న కారు దళిత, గిరిజన రైతులు బయట కొనలేక ఇప్పటికే ఎకరానికి ముప్పై వేల రూపాయలు ఖర్చు చేసి వరి సాగు చేస్తే ఒక్క యూరియా బస్తా కొరకు రాత్రి నుండి సాయంత్రం వరకు రైతులు రోడ్ల మీదకు రావల్సిన పరిస్థితి దాపురించిందనీ, ప్రైవేట్ డీలర్లకి యూరియా ఇచ్చి 500 రూపాయలకు కి అమ్మిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం డీలర్ల వద్ద కూడా రెండు వందల రూపాయలకు అమ్మియాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు సరిపడా యూరియా ఇవ్వకపోయినా ప్రైవేటు డీలర్ల వద్ద 200 రూపాయలకి అమ్మకపోయినా రైతుల తరుపున ప్రత్యక్ష పోరాటం చేస్తామని బెల్లంకొండ సత్యనారాయణ హెచ్చరించారు.ఈ ధర్నాలో మల్లె వెంకన్న సిఐటియు మండల కన్వీనర్ రైతు సంఘం నాయకులు రేఖ తిరపయ్య, సంపత్ పిచ్చయ్య, కృష్ణయ్య, సుధాకర్ రెడ్డి, వెలుగోరి పాండు, వెంకన్న, వెంకట్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీను, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## కోర్టు వాయిదాలకు డుమ్మా కొట్టిన ఎంపీడీవో

### ఆగ్రహంతో వారెంట్ జారీ చేసిన న్యాయమూర్తి

మిర్యాలగూడ, సెప్టెంబర్, 11,( ప్రజాజ్యోతి ): కోర్టు వాయిదాలకు గైర్హాజరైన దామరచర్ల ఎంపీడీవో అలివేలు మంగతాయారు పై కోర్టు వారెంట్ జారీ కావడంతో గురువారం పోలీసులు మిర్యాలగూడ జిల్లా అదనపు కోర్టులో హాజరు పరిచారు.రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి బెనిఫిట్స్ విషయంలో కోర్టు వాయిదాలకు ఎంపీడీవో డుమ్మా కొట్టడంతో ఆగ్రహించిన జిల్లా అదనపు జడ్జి వారెంట్ జారీ చేయడం తో ఈ సంఘటన జరిగినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు. 2021లో దామరచర్ల మండలం దిలావర్ పూర్ పంచాయతీ కార్యదర్శి గా పనిచేసిన టేకుల శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.ఆయనకు ఒక కుమార్తె ఉండగా, గతంలో భార్య చనిపోవడంతో, మిర్యాలగూడ చెందిన మరో మహిళతో సహజీవనం చేస్తున్నట్లుగా సమాచారం. కాగా రోడ్డు ప్రమాదంలో సదరు శ్రీనివాస్ మృతి చెందటంతో ప్రభుత్వం నుంచి అందే బెనిఫిట్స్ విషయంలో కూతురు, రెండవ భార్యగా చెప్పుకునే మహిళ కోర్టును ఆశ్రయించడంతో, ఆ కేసు విచారణ ఆశం లో పలు కోర్టు వాయిదాలకు ఎంపీడీవో గైర్హాజరు కావడంతో ఈ విషయాన్ని ప్రభుత్వ ప్లీడర్ జడ్జి దృష్టికి తీసుకుపోయారని, ఆగ్రహించిన జడ్జి వారెంట్ ఇష్యూ చేశారని సమాచారం. గురువారం ఎంపీడీవోను కోర్టులో హాజరు పరచడంతో మందలించిన న్యాయమూర్తి మొదటి తప్పుగా హెచ్చరించి, అనంతరం సొంత పూచికత్తుపై వదిలేసినట్లు సమాచారం. ఈ విషయంలో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎంపీడీవో అందుబాటులో లేరు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం.



**నడిగూడెం, సెప్టెంబర్ 11, ప్రజా జ్యోతి:**

జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయియులను ఘనంగా సన్మానించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన రెండు మండలాల హిందీ ఉపాధ్యాయ కాంప్లెక్స్ సమావేశంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన హిందీ ఉపాధ్యాయులు పీర్ సాహెబ్, కృష్ణ వేణి లను మండల విద్యాధికారి ఉపేందర్ రావు, సముదాయ చైర్మన్ మస్రం శ్రీనివాస్ లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు యండి మౌలానా,శ్రీనివాసరావు హిందీ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్ల ను అందజేస్తున్న ఎస్పీ నరసింహ.



**నడిగూడెం, సెప్టెంబర్ 11 ,ప్రజా జ్యోతి:**

తొమ్మిది నెలల క్రితం నడిగూడెం మండల కేంద్రంలో గల యమ్ ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం నుండి విధులు ముగించుకొని బైక్ పై ఇంటికి వెళ్లుచుండగా మార్గమధ్యలో మొబైల్ ఫోన్ జారిపోవాటంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా వారి విచారణ అనంతరం100 ఫోన్లను రికవరీ చేసి జిల్లా వ్యాప్తంగా పోగొట్టుకున్న ఫోన్లను జిల్లా ఎస్పీ నరసింహ చేతుల మీదుగా గురువారం అందుకున్నట్లు ఉపాధి సిబ్బంది విజయ్ తెలిపారు. కార్యక్రమంలో డి ఎస్ పి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 14న ఆలేరు లో 35వ సబ్ జూనియర్ జిల్లా కబడ్డీ సెలక్షన్ పోటీలు .. జిల్లా కార్యదర్శి పూల నాగయ్య

**ఆలేరు, సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**

యాదాద్రి భువనగిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35వ సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య గురువారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ఆలేరు పట్టణంలోని ఫ్రెండ్స్ క్లబ్ ఆవరణలో ఉదయం 10 గంటలకు జరిగే పోటీలకు పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా 55 కిలోలలోపు బరువు, 16 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని 30-11-2009 లోపు జన్మించి ఉండాలని తెలిపారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు, ఎస్ ఎస్ సి మెమో, జనన సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని ఇవి కేవలం యాదాద్రి భువనగిరి జిల్లా వాసులు మాత్రమే పాల్గొనాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఈనెల 25 నుండి 24 వరకు నిజామాబాద్ జిల్లా ముష్కల్ పట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848387964, 9182632738 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



# నిందితుడికి 21 సంవత్సరాలు జైలు శిక్ష, జరిమానా

## న్యాయమూర్తి రోజారమణికి సోషల్ మీడియాలో ప్రశంసలు

**నల్గొండ సెప్టెంబర్ 11**

**(ప్రజా జ్యోతి)**

వరుసగా కఠిన తీర్పులతో కామాంధులకు నల్లగొండ ఫోక్సో కోర్టు దడ పుట్టిస్తుంది. దీంతో న్యాయమూర్తి రోజా రమణికి సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. 2019లో కట్టంగూరు పోలీస్ స్టేషన్లో నమోదైన మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం కేసులో నిందితుడైన కట్టంగూరు గ్రామానికి చెందిన జడిగల హరీష్ అనే కామాంధుడికి గురువారం న్యాయమూర్తి రోజా రమణి 21 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.30,000 జరిమానా విధించారు. ఈ కేసులో నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో పోలీసులు సమర్పించిన సైంటిఫిక్ ఎవిడెన్స్ కీలకంగా మారింది నిందితుడు తప్పించుకోలేకపోయారుఅని అన్నారు. బాధితురాలికి ఐదు లక్షల రూపాయలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా అందించాలని తీర్పు వెలువడించిందని జిల్లా ఎస్పీ తెలిపారు.




# హెపటైటిస్-బి వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా తీసుకోవాలి: జిల్లా వైద్యాధికారి డా. మనోహర్

**ఆలేరు, సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):**



జిల్లాలో పనిచేస్తున్న వైద్య మరియు ఆరోగ్యశాఖ సిబ్బంది అందరూ తప్పనిసరిగా హెపటైటిస్-బి వ్యాక్సిన్ తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. గురువారం ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ( సిహెచ్సి) లో నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం లో భాగంగా హెల్త్ కేర్ వర్కర్లకు హెపటైటిస్-బి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. మనోహర్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖ సిబ్బంది విధుల్లో భాగంగా అనుకోకుండా కలుషిత వ్యర్థాలు, సిరంజిలు, ఆసుపత్రి సామాగ్రి వంటివి తాకే అవకాశం ఎక్కువగా ఉంటుందని, దింతో వారు హెపటైటిస్-బి బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ వ్యాధి సోకితే కాలేయ సిరోసిస్, కాలేయ క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రతి ఒక్క సిబ్బంది ముందస్తుగా హెపటైటిస్-బి వ్యాక్సినేషన్ తప్పనిసరిగా తీసుకోవాలి అని సిబ్బందికి సూచించారు. జిల్లాలో మొట్టమొదటగా ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించామని, త్వరలో మిగతా అన్ని ఆసుపత్రులలో కూడా సిబ్బందికి ఈ వ్యాక్సినేషన్ అందజేస్తామని తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ మొత్తం మూడు దోసులుగా ఉంటుందని, మొదటిది జీరో డోస్, మిగతా రెండు దోసులను కూడా నిర్దేశిత సమయానికి తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం పర్యవేక్షణ అధికారి డా. సాయి శోభ మాట్లాడుతూ హెల్త్ వర్కర్లలో ఉన్న అపోహలను నివృత్తి చేస్తూ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ డా. స్వప్న రాథోడ్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. యశోద, ఇమ్యునైజేషన్ అధికారి డా. రామకృష్ణ, ప్రోగ్రాం అధికారిణి డా. ఏ. వీణ, జిల్లా ఎపిడిమాలజిస్ట్ నర్సింహా, హెచ్ఇఓ యాకయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ బోనగిరి సత్యనారాయణ, ఇతర వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇ సైన్ స్కానింగ్ విధానం రద్దు చేయాలి

## సర్వర్ ప్రాబ్లెమ్ ను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

## రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పంతంగి వీరస్వామి గౌడ్

**సూర్యాపేట టౌన్,సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి)**



:రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఈ సైన్ స్కానింగ్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిని కొనసాగించాలని సూర్యాపేట రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు,తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు,పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం సూర్యాపేట జిల్లా సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు.గత పది రోజులుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం ఈ సైన్ స్కానింగ్ విధానం తీసుకురావడం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పది నిమిషాల్లో పూర్తయ్యేది గంటన్నర పైగా సమయం వృధా అవుతుందని అన్నారు.ప్రభుత్వం తలా తోక లేని విధానాలు తీసుకోవడం వల్ల రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలు సర్వర్ ప్రాబ్లం ఈ కేవైసీ స్కానింగ్ ప్రాబ్లం తో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని వాపోయారు.ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నా రియల్ ఎస్టేట్ రంగం ప్రభుత్వ విధానాలతో ఇబ్బందులు ఎదుర్కొంటుందని అన్నారు.ప్రభుత్వ నిర్ణయాలతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు అవుతుందని విమర్శించారు.గతంలో పదివేల రూపాయలు చెల్లించిన వారికి ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.రిజిస్ట్రేషన్ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయని వాటికి కొత్త భవనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఏర్పడుతున్న సర్వర్ ప్రాబ్లం నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఖమ్మంపాటి అంజయ్య గౌడ్,రాపర్తి వెంకన్న గౌడ్,సరగండ్ల కోటేష్, గుమ్మడవెల్లి శీను,మధు,మహేష్,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని వెంచర్ పై చర్యలకు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు

**సంస్థాన్ నారాయణపురం,**

సెప్టెంబర్ 11, (ప్రజాజ్యోతి) : సంస్థాన్ నారాయణపురం మండలం జనగామ గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా వెంచర్ని ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేస్తున్నారని యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావుకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గురువారం జనగాం గ్రామానికి వచ్చిన అడిషనల్ కలెక్టర్ భాస్కరరావును కలిసి సర్వే నెంబర్ 5/2/2 లో 2.10 ఎకరాల భూమిని ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారని ఆరోపించారు. వ్యవసాయ భూమిని ప్లాట్లుగా చేసి నోముల భీమ్ రెడ్డి, మునుకుంట్ల సాయి కృష్ణ, కందగట్ల కిషన్ లు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా లేఅవుట్ వేసి ప్లాట్లను ప్రజలకు అమ్ముతూ మోసం చేస్తున్నారని అడిషనల్ కలెక్టర్ కు వివరించారు. వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ మంచాల జంగయ్య, గ్రామస్తులు శనిగల జంగయ్య, కొండూరు స్వామి, శనిగల నరేష్, బైకని రాజు, తోలు పూరి యాదయ్య, బొల్లేపల్లి బిక్షపతి, నాతి కృష్ణయ్య, ఐత రాజు కిరణ్, కొండూరు వెంకటేశం తదితరులు ఫిర్యాదు చేశారు.



# ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలి - కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాలను పరిశీలన**

**పనులు వేగవంతం చేయాలని ఆదేశం**

**ఆధారాలుంటే భూ సేకరణ రైతులకు న్యాయం చేస్తాం**

**జిల్లాలో అందుబాటులో యూరియా**



**చింతలపాలెం సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) :**

ఎత్తిపోతల పథకాల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులు,



కాంట్రాక్టర్లను ఆదేశించారు. చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్, వెల్లటూరు వద్ద ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను గురువారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లాకు సంబంధించిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించామని, ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయని తెలిపారు.వెల్లటూరు ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ వద్ద కొంత భూసేకరణ, సరిహద్దులు, అటవీ శాఖకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని, వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించామని ఆయన చెప్పారు. రైతులతో ప్రత్యేకంగా చర్చించి, ఆధారాలు సమర్పిస్తే ఆర్డీవో 15 రోజుల్లో పరిశీలించి చట్టప్రకారం రైతులకు న్యాయం చేస్తారని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇప్పటికే భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో వివాదం లేని రైతులకు రూ.30 కోట్లు నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు.వర్షాలు తగ్గిన నేపథ్యంలో అదనంగా యంత్రాలను ఏర్పాటు చేసి, పైపులు సమకూర్చి, సిబ్బందిని పెంచి పైప్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని, అలాగే పంప్ హౌస్ నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో యూరియా సమృద్ధిగాజిల్లాలో యూరియా ఎటువంటి కొరత లేదని కలెక్టర్ తెలిపారు. బుధవారం ఒక వ్యాగన్, గురువారం మరో వ్యాగన్ యూరియా వచ్చిందని, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ప్యాక్స్, ఆగ్రో సెంటర్లకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రైతులు అవసరమైనంత యూరియా మాత్రమే తీసుకోవాలని, నిల్వలు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ సురేందర్ రెడ్డి, ఇరిగేషన్ ఇంజనీర్లు అశోక్, సత్యనారాయణ, స్వామి, శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ ఆదిత్యతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంచినీటి సమస్య తీర్చాలి



**వలిగొండ సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి ప్రతినిధి)**

మండలకేంద్రంలోని వివిధ వార్డులలో మంచినీటి సమస్య తీర్చాలని బిజెపి మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ అన్నారు. గురువారం బిజెపి నాయకులతో కలిసి ఆయన స్థానిక ఎంపిడిఓ జలంధర్ రెడ్డి ని కలిసి పట్టణ కేంద్రంలోని వివిధ వార్డులలో నెలకొన్న మంచినీటి సమస్య తీర్చాలని కోరడంతో ఆయన స్పందించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బచ్చు శ్రీనివాస్, దోగిపర్తి సంతోష్, నాగరాజు, దయాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం కాపాడిన పోలీస్ అన్న

**-వృద్ధుని కి సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ నరేష్**




**హుజూర్ నగర్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)**

గుండెపోటుతో అపస్మారక స్థితిలో పడిపోయిన వృద్ధుడిని డ్యూటీ చేసే కానిస్టేబుల్ సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. గురువారం పట్టణంలోని గోవిందపురాని కి చెందిన కుడి తొట్టి స్వామి యూరియా కోసం క్యూలో నిలబడగా ఒక్కసారిగా స్వామికి హార్ట్ స్ట్రోక్ రావడంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ నరేష్ వెంటనే సిపిఆర్ చేసి వ్యక్తిని కాపాడారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ నరేష్ ని పట్టణవాసులు అభినందించారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న ప్రతి పోలీసు సిబ్బంది సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండేలా గతంలోని శిక్షణ ఇవ్వడం జరిగినది అని పోలీసు అధికారులు తెలిపారు.



## పాఠశాల స్థాయిలో తెలుగు ఉపాధ్యాయుల పాత్ర కీలకం

నాంపల్లి, సెప్టెంబర్,11(ప్రజా జ్యోతి):పాఠశాల స్థాయిలో తెలుగు భాష ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని ముష్టిపల్లి జెహెచ్ఎం శ్రీనివాసరావు అన్నారు.మండలంలోని ముష్టిపల్లి హైస్కూల్లో గురువారం నిర్వహించిన తెలుగు కాంప్లెక్స్ సమావేశాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యార్థి జీవితం మాతృభాషతోనే ప్రారంభమవుతుందని, అట్టి భాషను సులభతరం చేసి విద్యార్థికి అందించే గురుతర బాధ్యత తెలుగు ఉపాధ్యాయులదేనని అన్నారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే మాతృభాష కీలకమని కాంప్లెక్స్ స్థాయిలో చర్చించిన అంశాలు పాఠశాలలో అమలుపరిచి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో నాంపల్లి, మర్రిగూడ, చింతపల్లి, గట్టుప్పల మండలాల పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులంతా పాల్గొనగా ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన తెలుగు ఉపాధ్యాయులు బి వెంకటేశం, నల్ల నరసింహ, నరసింహచార్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్పిలు దామోదరచారి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**మునగాల సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):-**



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మునగాల మండలానికి చెందిన 20 మంది ఉపాధ్యాయులను మండల కేంద్రంలో ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అనిర్వచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన భరత్ బాబు, సైదయ్య గౌడ్ ,గెజిటెడ్ హెడ్మాస్టర్ దీపా దేవి, ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం వినోద, అన్నపూర్ణ, జ్యోతి, శ్రీలత ,లక్ష్మి, మహేశ్వరి, నాగలక్ష్మి, వీరస్వామి, మధుబాబు, ఉపేందర్, సైదులు, హరికృష్ణ, విద్యా భవాని, వాణి గాయత్రి, స్వాతి తదితరులు అవార్డు అందుకున్నారు.

# చీడపీడల నివారణపై అవగాహన

**చింతలపాలెం సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) -**

గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం (రావే)లో భాగంగా ఆంధ్ర లయోలా కళాశాల బీఎస్సీ వ్యవసాయ విద్యార్థినులు చింతలపాలెం రైతు వేదికలో గ్రామీణ వ్యవసాయ స్థితిగతులను అధ్యయనం చేశారు. విద్యార్థులు గ్రామస్తులతో సంభాషించి సమస్యలు తెలుసుకుని, పంట మార్పిడి, సమగ్ర వ్యవసాయం,




చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. గ్రామ పటం, వెన్ డయాగ్రామ్, పై చార్ట్‌ల ద్వారా వివరాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త పి. అక్షిత సాయి, సి. హెచ్. నరేష్, విస్తరణ అధికారి సంధ్యారాణి, రైతులు, వ్యవసాయ విద్యార్థినిలు సమత, సరళ, మేఘన, అఖిల, గీతిక తదితరులు పాల్గొన్నారు.

# గుడి నిర్మాణానికి సహకరించండి

**-మాజీ జెడ్పిటిసి సభ్యులు కోల ఉపేందర్**

**మునగాల సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):-**



మునగాల మండలం తాడువాయి గ్రామంలోని ప్రసిద్ధి చెందిన పురాతన దేవాలయం అయిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందినదని, ఈ గుడి వందల సంవత్సరాల చరిత్రల కలిగిన దేవాలయం అని నాటి శాతవాహన కాలంలో ఈ గుడి పేరున ఒక శిలా శాసనం కూడా ఉందని పూర్వీకులు చెప్పే వారిని అన్నారు. ప్రాచీన కాలంలో రాణి రుద్రమదేవి యుద్ధానికి బయలుదేరే సమయంలో తమ సైన్యంతో ఈ దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి వెళ్లినట్లుగా పూర్వీకుల సమాచారం అని అన్నారు. నాటినుండి నేటి వరకు ప్రజల మన్నలను పొందుతూ వస్తున్న గుడి ప్రస్తుతం శిధిలావస్థలో ఉందని ఈ గుడిని పునర్ నిర్మించాలని గ్రామ ప్రజలందరూ తమ అభిప్రాయాలను చెబుతూ గుడి నిర్మించాలని తీర్మానం చేశారని కావున ఈ ప్రాంత ప్రజలందరూ గుడి నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

# ప్రభుత్వ వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీ

హాలియా,సెప్టెంబర్11(ప్రజా జ్యోతి) : హాలియా పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి



గృహం, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా విద్యాధికారి మండల ప్రత్యేక అధికారి బొల్లారం బిక్షపతి గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాలలోని స్టోర్ రూమ్ ను పరిశీలించి విద్యార్థినులకు నాణ్యమైన కూరగాయలతో ఆహారం అందించాలని పాఠశాల ఎస్ఓ కు సూచించారు. దీంతోపాటు కొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేసి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. ఆయన వెంట మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# త్వరలో బీసీల కొత్త పార్టీ

**-బీసీ విద్యార్థి సంఘు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలంపల్లి సుధాకర్ గౌడ్**

**మునగాల సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):-**



బీసీలకు కూడా రాజకీయ పార్టీ ఉండాల్సిందేనని తెలంగాణలో త్వరలోనే బీసీ రాజకీయ పార్టీ ఆవిర్భవించబోతు ఒదని బీసీ విద్యార్థి సంఘు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలంపల్లి సుధాకర్ గౌడ్ అన్నారు. గత 79 ఏళ్లుగా బీసీలకు జరిగిన అన్యాయాన్ని ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ,బీసీలపై అగ్రవర్ణాల రాజకీయ ఆధిపత్యం ఇక చెల్లదని, స్థానిక సంస్థల ఎన్నికలలో అధిక స్థానాలు గెలుచుకొని బీసీల సత్తా ఏంటో చూపిస్తామని, బీసీల ఐక్యతను చాటుతూ రాజ్యాధికార సాధన కోసం అడుగులు వేస్తామని ,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే అన్ని అగ్రవర్ణ రాజకీయ పార్టీలకు సమాధానం అని చేస్తామని ఆయన అన్నారు.

# మొబైల్ ఎక్స్ రే ను ప్రారంభించిన ఎమ్మెల్యే బి ఎల్ ఆర్, సబ్ కలెక్టర్

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 11,( ప్రజాజ్యోతి ):**

పేద ప్రజలకు ఉపయుక్తంగా ఉండే మొబైల్ ఎక్స్ రే వాహనాన్ని గురువారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్), సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ లు ప్రారంభించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ( ఏ ఐ ) టెక్నాలజీ తో మెరుగైన ఫలితాలు



అందించే ఈ యంత్రాన్ని మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారు బహుకరించగా మొట్టమొదటగా మిర్యాలగూడ మండలంలోని బాదలా పురం బాలాజీ రైస్ మిల్ లో ప్రారంభించారు. మిల్లు పనిచేస్తున్న 30 మంది కార్మికులకు ఎక్స్ రేలు తీసి, ఐదు నిమిషాలలోనే ఖచ్చితమైన రిపోర్టును అందజేయడం గమనార్హం. ఈసందర్భంగా బిఎల్ఆర్ మాట్లాడుతూ మిర్యాలగూడఅభివృద్ధిలో, పేద ప్రజల సంక్షేమం లో రైస్ మిల్లర్స్ అసోసి యేషన్ వారి సహకారం అభినందనీయమన్నారు. ఇదే విధంగా ప్రభుత్వ పథకాలతో పాటు, మిర్యాలగూడ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ కేసా రవి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గౌరు శ్రీనివాస్, బోగవెల్లి వెంకటరమణ చౌదరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల వారీగా యూరియా పంపిణీ

**-మండల వ్యవసాయ అధికారి బుంగరాజు**

**మునగాల సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి):-**



మునగాల మండల కేంద్రంలోని అన్ని గ్రామాలలో ఒక్కో రోజు ఒక్కో గ్రామానికి యూరియా ఇవ్వబడుతుందని దానికి రైతులు సహకరించాలని మునగాల మండల వ్యవసాయ అధికారి బుంగరాజు రైతులను కోరారు. నేడు బరాకతి గూడెం గ్రామ రైతులకు గ్రామపంచాయతీ ఆవరణలో యూరియా ఇవ్వబడుతుందని కావలసిన రైతులు పట్టాదారు పాసుబుక్ జిరాక్స్ ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రాగలరని అన్నారు. తరువాత రోజు మునగాల గ్రామం ,కృష్ణానగర్ గ్రామం, నారాయణ గూడెం గ్రామం ఇలా ఒక్కోరోజు ఒక్కో గ్రామానికి ఇవ్వబడుతుందని అన్నారు. పట్టాదారు పుస్తకం తీసుకురాని రైతులకు ఎట్టి పరిస్థితుల్లో యూరియా ఇవ్వబడదు అని అన్నారు.

# ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తు నిర్మాతలు

**నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**

**రామన్నపేట సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి**

ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తు నిర్మాతలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. గురువారం రామన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పిఆర్ఎస్సీ సిరిగిరెడ్డి సంజీవరెడ్డి తో పాటు మండలానికి చెందిన 20 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కృత్రిమ మేధస్సుతో సుస్థిర వ్యవసాయం అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలను బలపతం చేయడానికి కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. రామన్నపేట మెన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను అభినందనీయమని తెలిపారు. తెలంగాణ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ జెల్లా సత్యనారాయణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో




మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రేపాల మదన్మోహన్, బి రవీందర్రావు, ఎం యాదగిరి, ఇంద్రసేనారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బోయగాలయ్య, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి ఎండి ఉస్మాన్, యాపాల కృష్ణారెడ్డి, తాటికొండ సూర్యనారాయణ, నూల సిద్ధప్ప, బోగోజు గోవర్ధనాచారి, బొడ్డు వెంకటేశం, గుత్తా నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రామన్నపేట సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి

విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య,మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి లు అన్నారు. గురువారం మండలంలోని సిరిపురం గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కట్ట దశరథ రెడ్డి, కందుల మల్లా రెడ్డి, బిట్ల సుధాకర్ రెడ్డి, కట్ట శేఖర్ రెడ్డి, జిల్లా సత్యనారాయణలు ?150,000తో సమకూర్చిన యూనిఫాంలు, షూస్ లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో దాతల సహకారం అభినందనీయమని కొనియాడారు. ఓర్పు సహనం పట్టుదలను పెంపొందించుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్ ఎస్ఎస్సి గా పనిచేసి రిటైర్డ్ అయిన సిరిగిరెడ్డి సంజీవరెడ్డిని ఘనంగా సన్మానించారు. అలాగే ఉపాధ్యాయులను



సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గవజ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, రామకృష్ణ, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీ నర్సు, మేక అశోక్ రెడ్డి, అప్పం రామేశ్వరం, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏలాంటి విద్యార్హత లేకున్నా పది రాసుకునే అవకాశం, ఒకే సంవత్సరంలో ఇంటర్ పూర్తి

## లక్ష్య డిస్టెన్స్ అకాడమీ కోఆర్డినేటర్ అనంతుల సతీష్

పెన్ పహాడ్ మండలం సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):



తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓపెన్ టెన్త్ ఇంటర్ అడ్మిషన్లు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా సెప్టెంబర్ 12చివరి అవకాశం మాత్రమే ఉన్నదని లక్ష్య డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ కోఆర్డినేటర్ అనంతుల సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు వారు మాట్లాడుతూ చదువు మధ్యలో మానేసిన వారు పదవ తరగతి పూర్తి చేసుకునే అవకాశం కలదు ఎలాంటి విద్యార్హత లేకున్న పది రాసుకునే అవకాశం కలదు ,పది పాస్ అయిన వారు ఇంటర్ ఒక్క సంవత్సరంలో పూర్తి చేసుకునే అవకాశం ఉన్నదని చెప్పారు ఈ అవకాశం మళ్లీ రాదని వెంటనే అడ్మిషన్ తీసుకోవాలని వారు కోరారు ఇంటర్లో గ్రూపులు ఎంపీసీ బైపిసి హెచ్ సిఇసి సైన్స్ మరియు ఆర్ట్ ఇంగ్లీషు మరియు తెలుగు మీడియాలలో అడ్మిషన్లు పొందవచ్చు అని పదవ తరగతికి రాయడం చదవడం వచ్చి 14 సంవత్సరాలు నిండిన వారు పదో తరగతి పూర్తి చేసే అవకాశం కలదు అని అన్నారు పది పాస్ అయిన వారు ఇంటర్ కేవలం ఒకే సంవత్సరం పూర్తి చేసుకున్న అవకాశం కలదు అని అడ్మిషన్లకు మరిన్ని వివరాలకి లక్ష్య డిస్టెన్స్ అకాడమీ బ్రిలియంట్ స్కూల్ పక్కన నయా నగర్ కోదాడ 9542 10 7771, 7981 528312 పై నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

# ఆకుపాముల వాసికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



మునగాల సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):-

మునగాల మండల పరిధిలోని ఆకుపాముల గ్రామానికి చెందిన రాజుల లక్ష్మీనారాయణ మఠంపల్లి మండలం మోడల్ స్కూల్లో తెలుగు భాషా పండితుడుగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం రోజు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతుల మీదుగా రాజుల లక్ష్మీనారాయణకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందజేయడం జరిగింది. ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డున అందుకోవటం పట్ల ఉపాధ్యాయులు మిత్రులు, కుటుంబ సభ్యులు విద్యార్థులు అభినందించారు.

# అంకమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని జయప్రదం చేయాలి

అనంతగిరి,సెప్టెంబర్ 11 ప్రజాజ్యోతి:



అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామం పొలిమర్ల లో వేంచేసి ఉన్న అంకమ్మ,మారమ్మ, మద్దిరావమ్మ దేవతల జాతర మహోత్సవం అఖిలపక్ష నాయకుల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేయడం జరిగింది దేవాలయంలో అమ్మవార్ల అలంకరణ మరియు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు గురువారం ఏర్పాట్లు చేశారు జాతర శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల నుండి ప్రారంభమవుతుందని కావున ఇట్టి కార్యక్రమంలో యావన్మంది భక్తులు పాల్గొని ప్రతి సంవత్సరం మాదిరిగానే కోర్కెలు తీర్చే చల్లని తల్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తదుపరి ఉదయం 11 గంటల నుండి గ్రామంలో వన భోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహించబడుతుంది కావున ఇట్టి వన భోజన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ కుల, మత, రాజకీయాలకతీతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొంది జాతరను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు.

# మేకల సందీప్ కి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

గరిడేపల్లి,సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడు ఎంపీపీఎస్ ప్తాఠశాల ఉపాధ్యాయుడు మేకల సందీప్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.బుధ వారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లో గురుపూజోత్సవం సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ చేతుల మీదుగా సందీప్ ప్రశంస పత్రం అందున్నారు.1997 నుండి 1999 వరకు ఉస్మానియా యూనివర్సిటీ లో (ఎంఎస్సి)బి ఎడ్ పూర్తి చేసి 2002 లో ఉద్యోగం సాధించారు.మొదటిగా కల్మల్ చెరువు ఎంపీపీఎస్ పాఠశాలలో, 2007,2008 సంవత్సరంలో డిప్యుటేషన్ పై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గరిడేపల్లి లో గణితశాస్త్రం,భౌతికశాస్త్రం బోధించారు.2009 నుండి 2018 వరకు ఎంపిపిఎస్ పాఠశాల కుత్బుషపురంలో,2018 నుండి ప్రస్తుతం ఎంపిపిఎస్ పాఠశాల పొనుగోడు లో పనిచేస్తున్నారు. 2021 లో వ్యాస పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సూర్యాపేట వారిచేజిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు,2002 లో మండల విద్యాధికారిచే మండల ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.2021 నుండి ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ నుండి ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ గా యోగా దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయం,కోర్టు లో యోగా డే నిర్వహించారు.కలెక్టర్ చేతుల



మీదుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ తరుపున మెమెంటో అందుకున్నారు.తాను పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్ది ఉన్నత స్థానాల్లో నిలిపారు.సందీప్ కి అవార్డు రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

# ఇందిరమ్మ కాలనీకి మోక్షం ఎప్పుడో

మునగాల సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):-



మునగాల మండలం బరాకతి గూడెం గ్రామంలో 2008 సం వత్సరంలో నాటి ప్రభుత్వం 11 ఎకరాల భూమిని రైతుల నుండి ఇందిరమ్మ కాలనీ పేరుతో పేదలకు ఇవ్వాలని సేకరించింది. ఈ కాలనీలో 1/4 వంతు మాత్రమే పేదవాళ్లు కి చెందాయని మిగిలిన ప్లాట్లను ఆయా పార్టీల నాయకులు ఆవుకున్నారని, ఇప్పటివరకు చాలామంది నిరుపేదలకు ప్లాట్లు దక్కలేదని ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కాలనీ పేరుతో ఏర్పాటుచేసిన కాలనీ ప్రజలను మోసం చేస్తుందని వెంటనే కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

# శ్రీ వెంకటేశ్వర విద్యాలయం లో ఉచిత మెడికల్ క్యాంపు.....

మోతె సెప్టెంబర్ 11( ప్రజా జ్యోతి ):

సురక్ష ఎన్జీవో ఆధ్వర్యంలో మోతె మండలం మామిళ్లగూడెం లోని శ్రీ వెంకటేశ్వర విద్యాల యం నందు గురువారం ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించడంతో సుమారు 260 మంది హాజరు కాగా వివిధ రకాల శస్త్ర చికిత్సల నిమిత్తం సుమారు 65 మందిని సిఫారస్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్జీవో జనరల్ మేనేజర్ గద్దం సాంబశివరావు పాఠశాల యాజమాన్యాన్ని అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు. సురక్ష డైరెక్టర్ శ్యామ్యూల్, కామినేని హాస్పిటల్ మేనేజర్ మురళీకృష్ణ, ఆయన బృందాన్ని సురక్ష ఎన్జీవోస్ వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జానీ మియా, ప్రిన్సిపల్ సఫియా, డైరెక్టర్ అబ్దుల్ ఆజాద్, సయ్యద్మియా, సైదులు, రాములు , నరసయ్య పుల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.



# పోచంపల్లిలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

- జెడ్పీహెచ్ఎస్ స్కూల్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ
ఉత్తమ ఫలితాలు సాధించిన 250 మంది విద్యార్థులకు సైకిల్స్ పంపిణీ
- జిల్లా కలెక్టర్ హనుమంతరావు





**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)**

మండలంలోని జూలూరు గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ స్కూల్ ను గురువారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకి మధ్యాహ్నం భోజనంలో పెట్టే ఆహారాన్ని పరిశీలించారు. అలాగే రోజు మెనూ ప్రకారం పెడుతున్నార లేదా అని పరిశీలించారు. ప్రతి రోజు ఆహారం రుచికరంగా ఉంటుందా , మీకు సరిపోను పెడుతున్నారా లేదా అని విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. క్లాస్ లు ఎంతవరకు జరిగాయని , పదో తరగతిలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని, గత విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం ఎంత వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని , ఎక్కువ మార్కులు వచ్చిన 250 మంది విద్యార్థులకు సైకిల్స్ పంపిణీ చేస్తామని , ఈ స్కూల్ నుండి కూడా విద్యార్థులు సైకిల్స్ తీసుకుంటారా లేదా అని విద్యార్థులను అడిగి ఉత్సహాపరిచారు. ఈ సంవత్సరం మంచి మార్కు సాధించేవిద్యార్థినీ ,విద్యార్థులకు సైకిల్ లను అందజేయడం జరుగుతుందని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. అంగన్వాడీ కి ఎంత మంది పిల్లలు వస్తున్నారని, ఎంత మంది గర్భిణిలు, బాలింతలు వస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. రోజు అందరికి నాణ్యత తో కూడిన పౌష్టికాహారాన్ని పెడుతున్నారా, పాలు, గుడ్డు పెడుతున్నారా అని అడిగి తెలుసు కున్నారు. పిల్లలలో ఎవరైనా బలహీనంగా ఉన్నారా, ఉంటే వారికి బాలామృతం ప్లస్ ఇచ్చారా, రోజు రెండు పూటలా తినిపించాలని తెలియజేయలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీల వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దు...

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్గొండ సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

గర్భిణీ స్త్రీల వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గురువారం ఆమె నల్గొండ మండలం, రాములబండ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి హై రిస్క్ ఏఎన్ సి కేసులు, కుక్క కాటుకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్, ఈడిడీ క్యాలెండర్, ఆసుపత్రిలో మందుల అందుబాటు, మలేరియా,డెంగ్యూ పరీక్షల నిర్వహణ తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ జమీర్ తో మాట్లాడుతూ హై రిస్క్ గర్భిణీ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం వారికి వైద్య సేవలు అందించాలని చెప్పారు.ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రికి వస్తున్న జ్వరం కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పి హెచ్ సి లో అందుబాటులో ఉన్న మందులు , ఆంటీ రేబిస్ వ్యాక్సిన్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా



కలెక్టర్ ఆసుపత్రి ఆవరణ లో పరిశుభ్రతను పరిశీలిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అప్పజిపేటలో ఉన్న చందుపట్ల మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘనంగా సన్మానం



**పెన్ పహాడ్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీపాది ఉపేందర్ ని ఘనంగా సన్మానించిన బిసి యువజన సంఘం మండల అధ్యక్షుడు దూబని మల్లేష్ యాదవ్. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీపాది ఉపేందర్ ని బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు దూబని మల్లేష్ యాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు పొందడం ప్రతిభకు దక్కిన గౌరవం అని విద్యార్థులకు వినూత్న శైలిలో బోధించడం ఆయన ప్రత్యేకత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి సాకేత్, విజయ్ కుమార్, వంశి, వీరబోయిన ప్రవీణ్, ఉప్పల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయలకు సన్మానం

**చింతలపాలెం సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)**

- చింతలపాలెం మండల ఎంఆర్సీ భవనంలో గురువారం ఉత్తమ ఉపాధ్యాయ సన్మానోత్సవ కార్యక్రమం ఘనముగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అనసూయమ్మ (మండల ప్రాథమిక పాఠశాల, చింతలపాలెం), డి సుజాత (మండల ప్రాథమిక పాఠశాల తమ్మారం) సన్మానించారు. అదేవిధంగా మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కె జ్యోతి (ఎస్జిటి, వజినేపల్లి), పెండెం శ్రీనివాస్ (ఎస్ఎ, జిల్లా పరిషత్ హైస్కూల్ చింతలపాలెం), ఎస్ శ్రీను (ఎస్జిటి, దొండపాడు), ఆర్ సురేష్ (ఎస్జిటి, కిష్టాపురం), ఐ క్రాంతి కుమార్ (పిడి, జిల్లా పరిషత్ హైస్కూల్ వెంకటనరసింహపురం), వి శ్రీనివాస చారి (ఎస్జిటి, ఎస్సీ కాలనీ దొండపాడు), ఆసియా (సిఆర్టి, కెజిబివి) లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ నారపరాజు శ్రీనివాస్, జిల్లా పరిషత్ హైస్కూల్ తమ్మారం ప్రధానోపాధ్యాయుడు ఎలీషా, జిల్లా పరిషత్ హైస్కూల్ దొండపాడు ప్రధానోపాధ్యాయుడు సత్తిరెడ్డి, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తులను వేగవంతం చేయాలి

నాంపల్లి, సెప్టెంబర్,11(ప్రజా జ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ ఎఫ్ బి ఎస్) దరఖాస్తులను వేగవంతం చేయాలని చండూర్ ఆర్డీవో శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో శ్రీదేవి స్థానిక తహసీల్దార్ గూగులోతు దేవా సింగ్ మరియు సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం 18నుంచి 59 ఏళ్ల మధ్య వయసు గల కుటుంబంలోని ప్రాథమిక జీవనోపాధి అందించే వ్యక్తి మరణించినప్పుడు దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు రూ.20,000 ఆర్థిక సహాయం అందించే కేంద్ర ప్రభుత్వం పథకం. ప్రభుత్వం ఈ పథకం దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు సామాజిక భద్రతను అందించడంలో లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే సెక్షన్ 22-ఎ గురించి క్లుప్తంగా చర్చించి సూచించారు. మండల స్థాయి ఉద్యోగ బాధ్యతలు మరియు జిపిఓల ప్రాముఖ్యత గురించి చర్చించి పలు సూచనలు తెలిపారు.



# నేడు చింతపల్లి మండలంలో ఎమ్మెల్యే మార్కింగ్ వాక్



**చింతపల్లి సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి)**

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మార్నింగ్ వాక్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.నేడు చింతపల్లి మండల కేంద్రానికి ఎమ్మెల్యే బాలు నాయక్ ఉదయం మార్నింగ్ వాక్ కార్యక్రమం చేపట్టనున్నారు.అయితే ఉదయం 7 గంటలకు చింతపల్లి మండల కేంద్రంలోని వివిధ కాలనీలోని పర్యటించి ప్రజ సమస్యలు తెలుసుకోనున్నారు.అదేవిధంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.అనంతరం ఉదయం 11 గంటల సమయంలో కలెక్టర్ తో కలిసి ఆర్ అండ్ఆర్ కాలనిలో సీసీ రోడ్లు,సైడ్ డ్రైన్లు,భూగర్భ డ్రైన్లకు శంకుస్థాపన చేయనున్నారు.అదేవిధంగా 11:30 గంటలకు హరిజనాపురం గ్రామంలోని ఓఆర్ఎస్ ఆర్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

# నోముల మారయ్య మృతదేవానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి**

రామన్నపేట మండల మాజీ జెడ్పిటిసి నోముల పద్మ భర్త నోముల మారయ్య మాజీ సర్పంచ్ ఈరోజు ఉదయం మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించడం జరిగింది అనంతరం కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్ ,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, గొరిగే నరసింహ ,పున్న వెంకటేశం, ఎండి అమీర్, జిల్లా నాయకులు ఎన్నే చాంద్ , బత్తుల వెంకన్న ,కూనూరు ముత్తయ్య ,ఆవుల నరేందర్, జెట్టి శివప్రసాద్, ఆవుల శ్రీధర్ లవణం ఉపేందర్, చిప్పలపల్లి రవి, రేమిడాల వెంకన్న ,గట్టు మల్లయ్య , తదితరులు పాల్గొన్నారు.





# బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుంది..

## మంత్రి పొంగులేటి ఫైర్

**హైదరాబాద్,**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కృషి చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం అడ్డుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ(గురువారం) హైదరాబాద్‌లోని మంత్రి పొంగులేటి నివాసంలో కాంగ్రెస్ నేతలు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి బీసీ విజయోత్సవ బహిరంగ సభ విజయవంతం కోసం జనసమీకరణ ఏర్పాట్లపై చర్చించామని తెలిపారు. 42శాతం బీసీ రిజర్వేషన్లతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఉద్ఘాటించారు. బహుజన వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

### కేసీఆర్ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు: బీర్ల ఐలయ్య

గత కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఒక్క డబుల్ బెడ్ రూం ఇళ్లు కూడా ఎందుకు ఇవ్వలేదని తెలంగాణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రశ్నించారు. ఆలేరు నియోజకవర్గానికి 3700 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. ప్రజా పాలనతో, బీర్ల ఫౌండేషన్ సహకారంతో పేదలకు ప్రోత్సాహం ఇస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు పట్టుబట్టలు, పొట్టేలు బహుకరిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య. ఆలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లను పార్టీలకు అతీతంగా ఇస్తున్నామని మాటిచ్చారు. 2007లో వర్గూర్ గ్రామంలో దళిత వాడల్లో మాజీ సీఎం కేసీఆర్ పల్లెనిద్ర చేశారని గుర్తుచేశారు. అప్పుడు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని పేదలకు కేసీఆర్ చెప్పారని.. కానీ తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ధ్వజమెత్తారు. పేదలను కేసీఆర్ నట్టేట ముంచారని మండిపడ్డారు. చట్టం తన పని తాను చేసుకుపోతోందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపు ఉంటే అధికారంలోకి వచ్చిన వారంలోపే బీఆర్ఎస్ నేతల అరెస్టులు ఉండేవని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు.

# నేపాల్ నుంచి సొంతగడ్డకు బయల్దేరిన తెలుగువారు

**హైదరాబాద్,**

నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగు పౌరులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంలో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకున్న ప్రత్యేక చొరవ ఫలించింది. ఆయన పర్యవేక్షణలో పోఖరాలో ఉన్న 10 మంది తెలుగు వారిని ప్రత్యేక విమానంలో ఖాట్మండుకు తరలించారు. ఈ విమానం మధ్యాహ్నం 12:40 గంటలకు పోఖరా నుంచి బయల్దేరి 1:15 గంటలకు ఖాట్మండు చేరుకుంది.అనంతరం, ఖాట్మండు నుంచి విశాఖపట్నం బయల్దేరిన ఇండిగో విమానంలోనే వీరిని రాష్ట్రానికి తరలించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సహాయక చర్యలను మంత్రి లోకేశ్ నేరుగా ఆర్టీజీఎస్ వార్ రూమ్ నుంచి సమీక్షించారు. బాధితులను వీలైనంత వేగంగా, సురక్షితంగా వారి కుటుంబాల చెంతకు చేర్చడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ కొనసాగింది. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేశ్, ఢిల్లీ ఏపీ భవన్ ప్రత్యేకాధికారి అర్జా శ్రీకాంత్, జనసేన నాయకులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు. ముఖేశ్ కుమార్ మీనా, కోన శశిధర్, కాటంనేని భాస్కర్, ప్రఖర్ జైన్ వంటి ఉన్నతాధికారులు ఈ తరలింపు ప్రక్రియను సమన్వయం చేశారు.

# రసాయన ఆయుధాలతో ఐసిస్ ఉగ్రకుట్ర భగ్నం..

దేశంలో విధ్వంసం సృష్టించేందుకు ఐసిస్ ఉగ్రవాద సంస్థ పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయి. రసాయన ఆయుధాల తయారీలో నైపుణ్యం కలిగిన ఐదుగురు అనుమానిత ఉగ్రవాదులను అరెస్ట్ చేశాయి. తెలంగాణ, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఝార?ండ్ రాష్ట్రాల్లో ఏకకాలంలో నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో ఈ స్లీపర్ సెల్ గుట్టు రట్టయింది. ఈ ముఠా పాకిస్థాన్ లోని తమ హ్యాండ్లర్ల నుంచి ఆదేశాలు అందుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు.అధికార వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఉగ్రవాద ముఠా 'ఖిలాఫత్' నమూనాను అనుసరిస్తోంది. ఒక ప్రాంతాన్ని ఆక్రమించుకుని, అక్కడి నుంచి జిహాద్ కార్యకలాపాలు సాగించడమే ఈ మోడల్ ఉద్దేశం. యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించడం, బాంబులు తయారు చేయడం, ఆయుధాలు సమకూర్చుకోవడం వంటి పనులను ఈ ముఠా సభ్యులు చూసుకుంటున్నారని తెలిసింది.అరెస్టయిన వారిలో ఇద్దరిని ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ముంబైకి చెందిన అఫ్తాబ్, అబు సుఫియాన్‌గా వీరిని గుర్తించారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్‌లో కమ్రాన్ ఖురేషిని, తెలంగాణలో హుజైఫ్ యెమెన్‌ను అరెస్ట్ చేశారు. ఈ ముఠా నాయకుడిగా భావిస్తున్న అషార్ దానిష్‌ను ఝార?ండ్‌లోని రాంచీలో పట్టుకున్నారు.సంప్రదింపులు జరుపుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.